పండుగపూట జరుగుతున్న పాఠాలు

పండుగపూటా పాఠాలు..!

◆ ఉగాదికీ సెలవివ్వని ప్రయివేటు కళాశాలలు
◆ యంత్రాల్లా విద్యార్థులతో చదువులు
◆ సమాచారమిచ్చినా స్పందించని విద్యాశాఖ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయివేటు విద్యాసంస్థలు పండుగ పూట కూడా విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా ప్రత్యేక తరగతుల పేరుతో వేధిస్తున్నారు. కళాశాలలకు పేరు రావాలని, విద్యార్థులను చదువుల యంత్రాలుగా మారుస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని నారాయణ కళాశాలలో తెలుగువారి ప్రధాన పండుగ ఉగాది రోజున కూడా బుధవారం సెలవివ్వకుండా తరగతులు నిర్వహించారు. ఈ విషయం ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు తెలిసినా వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటి నుంచి ఒక్క రోజు కూడా సెలవులు ఇవ్వకుండా కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను చదువుల పేరుతో వేధిస్తున్నాయి. ప్రభుత్వం రెండవ శనివారం, ఆదివారంతో పాటు ప్రభుత్వ సెలవు రోజుల్లో కళాశాలలను నిర్వహించరాదని నిబంధన విధిస్తున్నా యాజమాన్యాలు వాటిని పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన సమయాలను పక్కనపెట్టి సమయపాలన పాటించకుండా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇలా విద్యార్థులను చదువుల పేరుతో మానసికంగా వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమైక్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. బుధవారం నాడు హిందూపురంలో నారాయణ కళాశాల వద్ద కూడా నిరసన తెలిపారు. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు సైతం తెలియజేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇచ్చే ముడుపుల మత్తులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పండుగుల పూట కూడా సెలవులు ఇవ్వకుండా మార్కుల వేటలో విద్యార్థులను వేధిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

విద్యార్థులను యంత్రాల్లా మార్చేస్తున్నారు..
బాబావలి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు వారి స్వార్థం కోసం విద్యార్థులను చదువుల యాంత్రాలుగా మారుస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజులతో పాటు పండుగపూట తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విషయాలను అన్ని ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇలాగే సెలవు రోజుల్లో కూడా తరగతులను నిర్వహిస్తే సంబంధిత విద్యాసంస్థలపై ప్రత్యక్ష దాడులు నిర్వహిస్తాం.

టమోటాకు గ్రాఫ్టింగ్..!

◆ పది నెలల పంటకాలం ◆ సత్ఫలితాలిస్తున్న దిగుబడులు
◆ శ్రీకృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అధ్యాపకుల ప్రయోగం

కాయగూరలకు గ్రాఫ్టటెడ్(అంటుగట్టడం) పద్ధతి ఏమిటా అనుకుంటున్నారా... అవును మీరు విన్నది నిజమే... అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు వద్దనున్న శ్రీ కృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అధ్యాపకులు కాయగూరల్లో టమోటాకు గ్రాఫ్టటెడ్ పద్ధతిలో సాగు చేస్తే ఎలాగుంటుందన్న ఆలోచన కలిగింది. తట్టిన ఆ ఆలోచనను ఆచరణలో పెట్టారు. ఇది ఒకింత సత్ఫలితాలను ఇచ్చే దిశగా ఉన్నట్టు అధ్యాపకులు చెబుతున్నారు.

టమోటాకు కట్టిన గ్రాఫ్టింగ్‌ను చూపుతున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటల్లో టమోటసాగు విపరీతంగా పెరిగింది. అయితే ఇది ఒక సీజన్‌లోనే దిగుబడి వస్తోంది. వేసవి వచ్చే సమయానికి పంట రావడం లేదు. ఎండలకు తట్టుకునే రాల్లేకపోవడంతో ఈ సమయంలో పంట దిగుబడి కూడా లేక టమోట ధరలు సైతం వేసవిలో మండుతూ ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ కృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జీవన్ బెట్టను తట్టుకునే రకాలైన సొలోనమ్ టోరమ్ రకం మొక్కకు సంబంధించిన వేరును, స్థానికంగా ఎక్కువగా పండించే టమోటా రకాన్ని ఒకదాన్ని ఎంచుకుని అంటుకట్టారు. దీన్ని గ్రీన్ హౌస్‌లో సాగు చేయడం ప్రారంభించారు. ఈ కలయికతో వచ్చిన మొక్క చాలా వరకు బెట్టను తట్టుకోవడమే కాకుండా, పంట దిగుబడి సాధారణంగా మూడు నుంచి నాలుగు మాసాల్లోపు పూర్తయ్యేది. పది మాసాల వరకు వస్తోందని జీవన్ తెలిపారు. అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, మరింత విస్తృత పరచి రైతుల వరకు చేర్చి చూడటం ద్వారా పూర్తి స్థాయి సామర్థ్యం తెలుస్తుందని వివరించారు. ఇది పూర్తి స్థాయి విజయవంతం అయితే అనంతపురం జిల్లాలో రైతాంగానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని భావిస్తున్నామన్నారు. ఎందుకంటే పంట కాలం పెరగడంతోపాటు దిగుబడి కూడా సాధారణ మొక్కకు ఐదు నుంచి ఆరు కిలోలు వస్తే దీనికి తొమ్మిది కిలోల వరకు కూడా దిగుబడి వచ్చే అవకాశముంది.

ఈ ప్రాంతావసరాలకు అనుగుణమైన రకాల కోసం ప్రయత్నిస్తున్నాం...

నారాయణరెడ్డి, కళాశాల అసిస్టెంట్ డీన్

అనంతపురం జిల్లా ఉద్యానవన పంటలకు పెట్టింది. పేరు అయితే ప్రకృతి కొంత, మరికొన్ని చోట్ల నేల స్వభావం కొంత ఆటంకాలుగా ఉంటున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లోనూ దిగుబడులు బాగా వచ్చి రైతులకు ప్రయోజనం చేకూరాలన్నది తమ అభిమతం. కళాశాల కేవలం విద్యను భోదించేందుకే కాకుండా ఈ ప్రాంత రైతాంగానికి మేలు చేసే విధంగా కొత్త ఆలోచనలు, ప్రయోగాలు తమ కళాశాల పరిధిలో చేస్తున్నాం. అందుకే కళాశాల సువిశాల వాతావరణంలోని దేశంలోని అన్ని రకాల మొక్కలను తీసుకొచ్చి పెంచడం జరుగుతోంది. కొత్తకొత్త రాకలుగా కూడా పెట్టియున్నాం. ఇందులో ఏ కొన్ని విజయవంతమైనా జిల్లా రైతాంగానికి ప్రయోజనం జరుగుతుందని ఆశిస్తున్నాం. ఆ దిశగా తమ సిబ్బంది, తాము పనిచేస్తున్నాం. ఇందులో భాగంగానే టమోటా గ్రాఫ్టింగ్ ప్రయోగం కూడా అని వివరించారు.

బహిరంగ వేలంలో మతలబు

పురపాలక సంఘానికి రూ.26వేలు.. మున్సిపల్ కౌన్సిల్‌కు రూ.10లక్షలు ఆదాయం..!

వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

పజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక పాలక వర్గం తమకు ఆదాయం వచ్చే అజెండాపై కనీస చర్చ లేకుండా అమోదం తెలుపుతోందన్నా ఆరోపణలు వినపిస్తున్నాయి. అందుకు పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న కూరగాయాల పెద్ద మార్కెట్ గత సంవత్సరం నుంచి తగ్గుతున్న ఆదాయమే నిదర్శనం. రెండు రోజుల క్రితం పెద్ద కూరగాయాల మార్కెట్ బహిరంగ వేలంలో పురపాలక సంఘానికి రూ.26వేలు ఆదాయం వస్తే....అధికార పాలక వర్గానికి రూ.10లక్షలు ముట్టినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. హిందూపురం పురపాలక సంఘ ఆధీనంలో ఉన్నా పెద్ద కూరగాయాల మార్కెట్‌తో పాటు పెద్ద, చిన్న పశువులు, వాటి తోళ్ల మార్కెట్, పరిగి బస్టాండ్‌లో ఉన్న ఖాళీ స్థలానికి బహిరంగ వేలాన్ని వేశారు. ఈ బహిరంగ వేలంలో పుపాలక సంఘానికి భారీగా ఆదాయం వచ్చేది. అయితే గత రెండు సంవత్సరాల నుంచి పరిశీలన చేస్తే పురపాలక సంఘానికి గండి పడినట్లు తెలుస్తోంది. గతంలో బహిరంగ వేలం వేసిన వాటిని పరిశీలన చేస్తే 2019-20 ఆర్థిక సంవత్సరంలో పెద్ద కూరగాయాల మార్కెట్‌ను అధికారులు రూ. 37.32లక్షలతో వేలం వేస్తే రూ.45లక్షలకు రమేష్ అనే పాట దారుడు దక్కించుకున్నారు. 2020-2021 కరోన విపత్కర సమయంలో సైతం రూ.34.26లక్షలతో వేలం వేయగా రూ.43.68లక్షలకు పోయింది. ప్రస్తుతం ఉన్నా పాలక వర్గం ఏర్పడిన అనంతరం బహిరంగ వేలంలో పాల్గొనే వారందరు సిండికేట్‌గా మారుతున్నట్లు సమాచారం. 2021-22వ ఆర్థిక సంవత్సరంలో ఇదే మార్కెట్‌ను రూ.48.67లక్షలతో వేలం వేయగా ఎవరు ముందుకు రాకపోవటంతో వేలం రద్దు చేశారు. అధికారులపై ఒత్తిడి తీసుకోచ్చి రూ.40లక్షలతో వేలం వేయగా రూ.43.02లక్షలకు ఆన్వర్ ఖాన్ అనే పాట దారుడు దక్కించుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మూడు సంవత్సరాల సగటున తీసుకుని రూ.43లక్షలతో వేలం వేశారు. అయితే మళ్లీ పాటదారులు అందరు కలిసి సిండికేట్‌గా మారి బహిరంగ వేలంలో పాల్గొనకుండా మార్కెట్ ధరను తగ్గించాలని కోరారు. దీంతో పురపాలక సంఘానికి ఎక్కువ ఆదాయం వచ్చే పెద్ద కూరగాయాల మార్కెట్‌తో పాటు పరగి బస్టాండ్‌లో ఉన్న ఖాళీ స్థలం వేలం పాటను రద్దు చేశారు. పాలక వర్గం మళ్లీ అధికారులపై ఒత్తిడి తెచ్చి పెద్ద కూరగాయాల మార్కెట్‌ను 37లక్షలకు కెసి శ్రీరామిరెడ్డికి అప్పగించారు. చివరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబందించి గత మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట జరిగింది. పెద్ద కూరగాయాల మార్కెట్‌ను మూడు సంవత్సరాల సగటున తీసుకుని అధికారులు రూ.41.23లక్షలతో వేలం వేయగా రూ.26వేల ఆదాయంతో కేవలం రూ.41.49.999లకు అస్మాబాను అనే వ్యక్తి దక్కించుకున్నారు. దీనిని కౌన్సిల్ ఆమోదం తెలపాలంటే పాలక వర్గానికి రూ.15లక్షలు డీల్ కుదిరినట్లు అరోపణలు వినపిస్తున్నాయి. అయితే గుత్తేదారులు అంత ఇవ్వలేమని తెగేసి చెప్పడంతో కనీసం రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు వార్తలు వినపిస్తున్నాయి. ఇలా పాలక వర్గం ఏర్పడినప్పటి నుంచి వారి సొంత లాభం చూసుకుంటు పురపాలక సంఘానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారన్నది ఈ లెక్కలే చెబుతున్నాయి. ఇదే కాకుండా గత ఏడాది నుంచి జరుగుతున్న మున్సిపల్ వాణిజ్య భవనం, కూరగాయాల మార్కెట్, హోల్‌సేల్ కూరగాయాల వ్యాపారులకు కేటాయిస్తున్న స్థలంతో పాటు చివరకు ఆకుకూరల వ్యాపారాలు చేసుకునే వారితో సైతం ప్రతి కౌన్సిలర్ లక్షలాది రూపాయలు తీసుకుని స్థలాలు, గదులు కేటాయించినట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. దీంతో పాటు పరగి బస్టాండ్‌లో ఉన్నా రాజీవ్ మెమోరియల్ ట్రస్టు వాణిజ్య గదులు సైతం చాల తక్కువ అద్దెలతో పాలక వర్గం గుత్తేదారులకు కట్టబెట్టినట్లు వార్తలు వినపిస్తున్నాయి.

రైతుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

ఉద్యానవనశాఖాధికారులపై ఎపిరైతుసంఘం ఆగ్రహం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతన్నల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యాన శాఖ అధికారులు పనితీరు మెరుగుపరడం లేదని రైతుల కష్టాలను వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ గురువారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని ఎడిఎ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కదిరి మండలం పరిధిలో ఉద్యాన పంటలైన టమోటా, బెండ ,అరటి , మామిడి, దోస, కర్బూజా, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేశారన్నారు. గత శని ఆదివారాల్లో కురిసిన అకాల వర్షాలకు 250 ఎకరాల్లో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. రైతులకు తీవ్ర నష్ట జరిగినా జిల్లా అధికారులు , కదిరి డివిజన్ ఉద్యాన శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వర్షాలకు దెబ్బతిన్న దోస, కర్బూజా, టమోటా తదితర వాటిని రైతులు తీసుకొచ్చి కార్యాలయం ముందు పడేసి అధికారుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. మండలంలోన మూర్తి పల్లి , వరిగి రెడ్డిపల్లి, బత్తలపల్లి తదితర గ్రామాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నా యన్నారు. ఉద్యాన శాఖ వ్యవసాయ శాఖ కార్యాలయానకి కూతవేటు దూరంలో ఉండే మూర్తి పల్లి గ్రామంలో పెద్ద ఎత్తున టమోటా ,మొక్కజొన్న, బెండ, తదితర పంటలు దెబ్బతిన్నప్పటికీ అధికారులకు కనబడడం లేదా అని నిలదీశారు. ఇంతవరకు గ్రామానికి వచ్చి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన పాపాన పోలేదని విమర్శించారు. అలాగే ఉద్యాన శాఖ అధికారి ఎప్పుడొస్తారో, ఆ అధికారి ఎవరో తమకు ఇంతవరకు తెలియదని రైతులు అన్నారు. రైతుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. పంట నష్టపోయి నాలుగైదు రోజులు గడుస్తున్నా దెబ్బతిన్న పంటలను సంబంధిత శాఖ అధికారి పరిశీలించిన పాపాన పోలేదని రైతులు ఈసందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దెబ్బతిన్న పంటలను పరిశీలిచి రైతుకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అందుబాటులో లేని ఉద్యానవన అధికారపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులతో పాటు మూర్తిపల్లి, వరిగి రెడ్డి పల్లి తదితర గ్రామాల రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ఉద్యానవన అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

అకాల వర్షానికి కదిరి మండలంలో దెబ్బతిన్న టమోటా, ఇతర కూరగాయాల పంటల..

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు జిల్లా అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తున్నామని కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ సచివాలయం నుంచి ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్య, మహిళా శిశు సంక్షేమం, గడపగడపకు మన ప్రభుత్వం వివిధ ప్రభుత్వ పథకాలపై ముఖ్య కార్యదర్శి సమీక్షించారు. సుస్థిర అభివృద్ధిలో 8 ముఖ్యమైన అంశాలపై కషి చేయాలని కార్యదర్శి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, విద్యాశాఖ అధికారి మధుసూదన్, వైద్యాధికారి కుల్లాయప్ప నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు త్వరగతిన పూర్తి చేయాలి

ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేయాలని, సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సాయి ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్‌లో కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నాణ్యత ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ టు థింక్, డ్రోన్ ప్లేయింగ్ తదితర పక్రియలను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో హద్దులు చూపించే రాళ్ల పాతే పనులు పూర్తి చేయాలని, 13 నోటిఫికేషన్ తదితర పనులలో పురోగతి కనిపించాలన్నారు. గడువులోగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తామని కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ సంబంధిత

ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

చిరుధాన్యాలతో ప్రయోజనాలు

పుట్టపర్తి రూరల్ : చిరుధాన్యాలు వాడడటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పెడపల్లి సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగరాణి తెలిపారు. ఈ మేరకు ఆమె పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి పంచాయతీ కొత్తూరు గ్రామంలో గురువారం నిర్వహించిన 'పోషన్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, జొన్నలు, మినుములు, ఉలవలు, అరికెలు, కొర్రలు, ఊదలు రోజువారి ఆహారంలో తీసుకోవడం వలన ఎంతో ఉపయోగకరమని అన్నారు. వీటివల్ల ఎన్నో పోషకాలు శరీరానికి అందుతాయని తెలిపారు. ఉబకాయం పోయి, జీర్ణశక్తి పెంపొందుతుందని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కెసి. రంగన్న, నిడిమామిడి సర్పంచి లతా బాలకృష్ణ, పంచాయతీ సెక్రెటరీ పుష్ప, మహిళా పోలీసులు నాగమణి, బేబీ రాణి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు, తదితరులు

సర్వే పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, తదితరులు

పకడ్బందీగా రీ సర్వే

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పకడ్బందీగా రీ సర్వే చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా డ్రోన్ సహాయంతో రీసర్వే చేపడుతున్నామన్నారు. సర్వే చేయడం వల్ల భూ వివాదాలను పరిష్కరించడానికి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

కొత్తచెరువు : ఏప్రిల్ మూడవ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఇన్‌చార్జి ఎంఇఒ వెంకటరమణ నాయక్, హెచ్ఎం చెన్నకృష్ణారెడ్డి తెలిపారు. కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలోని ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రయివేటు పాఠశాల విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 240 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 200 మంది ఈ పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

28న గేట్ మీటింగ్

కదిరి టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 28న సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలలో ఉద్యోగులు గేట్‌మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాకార్యదర్శి, అమరావతి జేఏసీజిల్లా ప్రధాన కార్యదర్శి జివిపి రావు కోరారు. ఏపీ జెఎసి పిలుపులో భాగంగా గురువారం కదిరి డిపో ఆవరణంలో 15వ రోజు ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కదిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కాలసముద్రం దివాకర్, కార్యదర్శి పి శంకరయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జివిఎం రెడ్డి, నరసింహులు, జమీల్, అనిల్, కె. హరికుమార్, ఎం సుందర్, మహిళా నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

చిలమత్తూరు : మండల పరిధిలోని చిలమత్తూరు–1, చిలమత్తూరు–3, వీరాపురం సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 4 వాలెంటర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపిడిఒ రాంకుమార్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24 నుండి 27 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

బత్తలపల్లి : మండలంలో ఖాళీగా ఉన్న వలెంటీర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ సాయిమనోహర్, ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి తెలిపారు. గురువారం వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని దంపెట్ల, నల్లబోయనపల్లి పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వాలెంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జ్యోతుల ఉత్సవం

సోమందేపల్లి : మండల కేంద్రంలోని పాత ఊరులోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జ్యోతుల మహోత్సవాన్ని ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని దేవాలయ కమిటీ చైర్మన్ డిసి ఈశ్వరయ్య తెలిపారు.

25న గ్రామపంచాయతీ గదుల వేలం

చిలమత్తూరు : ఈ నెల 25 వ తేదీన గ్రామ పంచాయతీ పరిధిలోని వారపు సంత, బస్టాండ్, జంతువధశాల, షాపింగ్ కాంప్లెక్స్‌లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు 50 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించాలని అన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట : మండల పరిధిలోని కట్టావుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలలో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఒ దుర్గ గురువారం తెలిపారు. పేద, అనాథ, డ్రాపౌట్, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల పిల్లలు ఆరో తరగతి, ప్రథమ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అలాగే 7,8,9 తరగతులకు సంబంధంచిన మిగిలిన పోయిన సీట్లకు కూడా అర్హులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



సోమందేపల్లి, కదిరిలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

సోమందేపల్లి : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పెద్దన్న మాట్లాడుతూ భగత్ సింగ్ దేశభక్తి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, రంగప్ప, గంగరాజు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేష్, నాగభూషణ, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి , కురుబ కిష్టప్ప , ఉప్పర కిష్టప్ప , ఈడిగ నాగరాజు , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా భారత స్వాతంత్ర సమరయోధుడు ప్రఖ్యాత విప్లవోద్యమ సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగపు అధిపతి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, దర్గా కూడలి, ఆంజనేయస్వామి ఆలయం దగ్గర వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం రమేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, డాక్టర్ హరీష్ బాబు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కదిరి సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్ జాన్, జిల్లా కమిటి సభ్యులు విజయ్ కుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశభక్తిని వివరంచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేంద్రప్రసాద్, రాజా నాయక్, నరేష్ నాయక్, అనిల్ నాయక్, నాగేంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్ సింగ్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మిట్టాంజనేయ స్వామి కళ్యాణ మంటపంలో మిట్టాంజనేయ స్వామి టెంపుల్ డెవలప్ మెంట్ సొసైటీ అధ్యక్షులు కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, పెనుకొండ డిఎస్‌పి హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో భగత్‌సింగ్ పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ నీలం రమేష్ రెడ్డి ,జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, బొక్సంపల్లి రామక్రిష్ణ, సాహితీ స్రవంతి అధ్యక్షులు హరి ,ప్రగతి శ్రీనివాసు,సుధాకర్ గుప్త తదితరులు భగత్ సింగ్ స్వాతంత్ర్య పోరాటం గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రవూఫ్ , శ్రీకృష్ణ దేవరాయ క్రికెట్ అసోసియేషన్ , మిట్టాంజనేయ స్వామి టెంపుల డెవలప్ మెంట్ అసోసియేషన్ సభ్యులు, పురప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయండి

మడకశిర రూరల్ : నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న కోరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయా మండలాల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ ఈ నెల 26 న గోరంట్ల మండలంలో యువగళం పాదయాత్ర ప్రవేశిస్తున్న సందర్భంగా అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. లోకేష్ పాదయాత్రతో వైసిపి నాయకుల గుండెల్లు రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాండురంగప్ప, రవిభూషన్, ఆదినారాయణ, అశ్వత్థామప్ప, ప్రకాష్, నాగోజి, రాజ్‌గోపాల్, మాజీ మండలకన్వీనర్ రామాంజనేయులు, ఈశ్వరప్ప, క్రిష్టప్ప, జైరామప్ప, మరేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 26న మండలంలో పర్యటించనున్న సందర్భంగా పర్యటనా ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే పార్థసారథి గురువారం పరిశీలించారు. మండలంలోని రెడ్డి చెరువు కట్ట, తిప్పరాజు పల్లి, పాలసముద్రం గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. 26న మండలంలో రెడ్డి చెరువు కట్ట గ్రామ సమీపన పాదయాత్ర ప్రవేశించనుంది. 27న గోరంట్ల పట్టణంలో నిర్వహించే బహిరంగ సభలో నారా లోకేష్ పాల్గొననున్నారు. పర్యటనా ఏర్పాట్లపై మాజీ ఎమ్మెల్యే పార్థసారథి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి నరసింహప్ప, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణు, ఉపాధ్యక్షులు జయరాం, కాలనీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

పెనుకొండ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తనకార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సవితమ్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం యువగళం పాదయాత్ర నియోజకవర్గంలోని గోరంట్ల మండలంలోని గౌనివారిపల్లి గ్రామం వద్ద ప్రవేశిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని టీడీపీ నాయకులను, కార్యకర్తలను, మహిళలను, ప్రజలను పెద్దఎత్తున తరలించాలని కోరారు. అనంతరం యువగళం పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు సూర్యనారాయణ, వెంకటరమణ, చంద్రమౌళి, వెంకటేశు, టైలర్ అంజినేయులు, సుబ్రహ్మణ్యం, డివి. అంజినేయులు, త్రివేంద్ర నాయుడు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన 'పల్లె' కుటుంబ సభ్యులు

నారాలోకేష్‌తో పల్లె కుటుంబసభ్యులు

ఓబుల దేవర చెరువు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఓబుల దేవల చెరువు మండలంలోని విడిది కేంద్రంలో నారా లోకేష్‌ను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తో పాటు ఆయన కుమారుడు క్రిష్ణకిషోర్‌రెడ్డి, కోడలు సింధూర కలిసి శాలువాతో సన్మానించారు. సత్య సాయి బాబా చిత్రపటాన్ని అందజేశారు.

పాదయాత్రకు జనసమీకరణలో నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర ఈనెల 21వ తేదీన పుట్టపర్తి నియోజకవర్గంలో కొనసాగిన నేపథ్యంలో టిడిపి నాయకులు జనసమీకరణలో విజయవంతం అయ్యారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న ఉద్దేశ్యంతో అసమ్మతినాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 25వ తేదీన ఒడిసి లో జరిగే లోకేష్ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ,హాజరుకావాలని దృక్పథంతో పల్లెపై అసమ్మతి ఉన్న నియోజకవర్గ నాయకులు సైతం జనాన్ని తరలించడానికి సమాయత్తమవుతున్నారు. పుట్టపర్తి మండలం నుండి పిసి. గంగన్న నాయకత్వం వహించి జనం తరలింపునకు నడుంబిగించారు. అదేవిధంగా బుక్కపట్నం మండలం నుండి పెద్దరాసు సుబ్రమణ్యం, పాముదుర్తి సంగా, సుధాకర ఓడిసి మండలం నుండి మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, అమడుగూరు, నల్లమాడ మండలం నుండి పార్టీకి విధేయులుగా ఉండి పల్లె పై అసమ్మతి ఉన్న నాయకులు సైతం శనివారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయడానికి వారి వారి మండలాల నుండి జనం తరలింపులో తలమునకలయ్యారు. ఆయా పంచాయతీలలోని వారి అనుచరులు బంధుమిత్రులను, కార్యకర్తలను, నాయకులను ఒ డి సి బహిరంగ సభకు తరలింపుచడానికి వాహనాలను సమకూర్చుకున్నట్లు వారు తెలిపారు. తాము పార్టీకి ఎప్పుడే విధేయులుగా ఉంటామని లోకేష్ పాదయాత్ర సత్యసాయి జిల్లా దాటేయేంతవరకు తాము ఆయన వెన్నంటే నడుస్తామని తెలిపారు. ఆరు మండలాల నుండి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మాజీ, ప్రస్తుత సర్పంచులు, మాజీ, ప్రస్తుత ఎంపీటీసీలుమాజీ స్టోర్ డీలర్లు ,మహిళా సంఘ నాయకులు, తెలుగుదేశం అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఓడిసి బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అంతేకాక పాముదుర్తి గ్రామానికి చెందిన సంగా సుధాకర్,

చురుగ్గా పాల్గొంటున్న అసమ్మతి నాయకులు

బుక్కపట్నం పేదరాసు సుబ్రమణ్యం ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో ఆ మండలంలో ఉన్న వారి సామాజిక వర్గంతో పాటు తెలుగుదేశం ద్వితీయ శ్రేణి నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పెద్ద సంఖ్యలో తరలించనున్నామని తెలిపారు. అదేవిధంగా పుట్టపర్తి మాజీ మున్సిపల్ పిసి గంగన్న తనకు ముందు నుంచి నియోజకవర్గంలో ఒక వర్గం ఉందని తన సామాజిక వర్గమే కాక తన వెంట నడిచే తెలుగుదేశం, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ఉన్నారని వారిని లోకేష్ సభకు తరలించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వీరే కాక నల్లమాడ, అమడగూరు ,ఒడిసి కొత్తచెరువు, మండలాల్లో ఉన్న నాయకులు సైతం ఈ బహిరంగ సభను జనాన్ని తరలించి సభను విజయవంతం చేయాలని శ్రమిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలివ్వాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే పారిశుధ్య కార్మికులు వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు మాత్రం ప్రతినెల జీతాలు తీసుకుంటూ కార్మికులకు మాత్రం మొండి చేయి చూపడం దారుణమన్నారు. ఉగాది పండుగకు ప్రతి కార్మికునికి 5 వేలు సర్దుబాటు చేస్తామని చెప్పిన కమిషనర్ మాట నిలుపుకోలేదన్నారు. దీంతో కార్మికులు పండుగ కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులకు ప్రతినెల 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు టిడిపి అండగా నిలుస్తుందన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : ధర్మవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఈసందర్భంగా పలువురు బాధితులను పరామర్శించ ఆర్థికసాయం అందజేశారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను, వివిధ ఆనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారి కుటుంబాలను గోనుగుంట్ల సూర్యనారాయణ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

అనవసర విమర్శలు తగదు

ధర్మవరం టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్‌ను విమర్శిస్తే సహించమని టీడీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల జయమ్మ కుటుంబం అంటే మంచి పేరు ఉందన్నారు. అలాంటి కుటుంబానికి చెదని గోనుగుంట్ల విజయ్‌కుమార్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు, చిత్రారామ్మోహన్, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, ఇర్షాద్, గొట్లూరు అనిల్, రావులచెరువు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోండి : డీఎస్పీ

పెనుకొండ : రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ హుస్సేన్‌పీరా కోరారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద అన్ని మసీదుల ముస్లిం మత పెద్దలతో రంజాన్ పండుగ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమములో ఎస్ఐ రమేష్‌బాబు, జమేదార్లు శ్రీనివాసులు, దాదాపీర్, పోలీస్ సిబ్బంది, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బత్తలపల్లి : కుటుంబ సభ్యులతో ఉగాది పండుగను సంతోషంగా జరుపుకున్న వ్యక్తి...మరుసటి రోజు గురువారం చికెన్ తీసుకువస్తానంటూ బత్తలపల్లికి వచ్చి తిరిగి వెలుతూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన మల్లెపూల చంద్రయ్య(51) బత్తలపల్లికి వెళ్లి చికెన్ తీసుకొని వస్తానంటూ ద్విచక్రవాహనంలో వచ్చాడు. చికెన్ తీసుకొని తిరిగి ఇంటికి వెలుతున్న సమయంలో గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను స్థానికులు ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రయ్య మృతిచెందాడు. చంద్రయ్య బత్తలపల్లిలోని ఓ హోటల్లో వంట చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతునికి భార్య ఉమాదేవితో పాటు కిరణ్, అరుణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని పాతచామలపల్లి గ్రామానికి చెందిన గోపీకృష్ణ (32) అనే యువకుడు బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోపీకృష్ణ మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కార్లు ఢీ - ఇద్దరికి గాయాలు

బుక్కపట్నం : మండల పరిధిలో జానకమ్మ పల్లి గ్రామ సమీపంలో గురువారం అతివేగంతో వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు జానకమ్మపల్లి గ్రామ సమీపంలో అతివేగంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పుట్టపర్తి మునిసిపల్ మేనేజర్ హరిప్ , డ్రైవర్ నరసింహమూర్తికి తీవ్ర గాయాలు అయ్యాయ.కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. గాయపడిన వారిని పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

తలుపుల : మండలంలోని ఎగువపేట గ్రామానికి చెందిన వెంకటరమణ ఆకస్మికంగా మృతిచెందాడు. దీంతో వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి చింతకుంట కృష్ణారెడ్డి (డికె బాబు) మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మృతుని భార్యకు రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌల, బొట్టు రమణ, గంగాధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని కాపుచన్నం పల్లి గ్రామ సమీపంలో గురవారం పేకాట ఆడుతున్న స్థావరం పై దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితులనుంచి రూ. 4,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

గుడిబండలో పేకాట జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడిబండ : గుడిబండ సమీపంలోని తుమ్మల మారమ్మ దేవాలయం సమీపంలో బహిరంగస్థలంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. ఈసందర్భంగా 29 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 78.200 నగదు, 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈదాడుల్లో కానిస్టేబుళ్లు రఫీ, చంద్ర నాయక్, వెంకటేష్ నాయక్, లక్ష్మి కుమార్. తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితులకు జైలు

ధర్మవరం టౌన్ : అధిక కట్నం కోసం భార్యను వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తకు 10 సంవత్సరాల 3 నెలల జైలు శిక్ష పడిందని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ సుబ్రమణ్యం కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మంచాల రేణుకాను ఆమె భర్త మంచాల రామంజినేయులు, అత్త మంచాల వసుందరమ్మ వేధించేవారు. అధిక కట్నం కోసం వారు చేసిన వేధింపులతో రేణుకా 2014వ సంవత్సరంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తలపై అప్పట్లో పోలీసులు 498–ఎ, 304–బి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతపురం 4వ ఏడీజే కోర్టులో జడ్జి విచారణ జరిపి నిందితులు మంచాల రామంజినేయులు, మంచాల వసుందరమ్మకు 10 సంవత్సరాల 3 నెలల జైలు శిక్ష విధించారని సిఐ తెలిపారు.

కారుబోల్తా... వ్యక్తి మృతి

కనగానపల్లి : మండల పరిధిలోని దాదులూరి వద్ద 44 జాతీయ రహదారిపై కారు బోల్తా కొట్టిన ప్రమాదం లో అనంతపురం నగరానికి చెందిన అత్తర్ హుసేన్(55) అనే వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన వివరాలు... అనంతపురం నగరంలోని ఎంజి.పెట్రోల్ బంకు వెనుక నివాసమున్న అత్తర్ హుసేన్ తన కూతురుకు ఆరోగ్యం బాగాలేకపోతే అల్లుడుతో కలిసి గురువారం ఉదయం అనంతపురం నుంచి బెంగళూరుకు వైద్య పరీక్షలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు వస్తున్న కారు టైరు దాదులూరు వద్ద పగిపోయి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడింది. కారులో ఉన్న అత్తర్ హుసేన్ మృతిచెందాడు. మృతుని కూతురు, అల్లుడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అయితే అత్తార్ హుసేన్‌కు ఎటువంటి గాయాలు కాకపోయినా ప్రమాదభయంతో మృతిచెందాడనిహైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెసులుబాటు కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభంతో పాటు ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో వివిధ కార్యలయాల్లో విధులు నిర్వహిస్తున్న ముస్లీం ఉద్యోగులకు ప్రార్థనలు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని ముస్లీం నగరా అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి ఈ విషయంపై వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సాదిక్, సినాజ్, చాందు, జబివుల్లా, ఫాజిల్, బిలాల్, అమీన్, హారూన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు,కదిరి

O.S.NO:402/2019.

Between:

S.బాలాజి S/o కృష్ణయ్య, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి తాలూక కడప జిల్లా. ...వాది

మరియు

T.M.చిన్న నాగభూషణ S/o Late వెంకటరమణ తలుపుల, తలుపుల మండలం. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమత్తమై 17/04/2023 వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 17/04/2023 వ తేదిన ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజర కావలెను. అట్లు కానీ పక్షములో పై కోర్టు వారు పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలుపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 17/04/2023
స్థలం: కదిరి

ఎ.చంద్రశేఖర్ రెడ్డి, బి.ఎ.,బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, కదిరి

O.S.NO:540/2019.

Between:

పర్కి సయ్యద్ నయీముల్లా ...వాది

మరియు

1. తుంగ అక్కులమ్మ W/o Late రామన్న, వయస్సు 78 సం॥లు,
2. తుంగ తిరుపాలమ్మ, W/o Late కృష్ణమూర్తి, వయస్సు 34 సం॥లు
3. తుంగ లిఖిత్ కుమార్, వయస్సు 13 సం॥లు,
4. తుంగ జగదీష్ కుమార్, వయస్సు 11 సం॥లు

No 3&4 మైనర్లు అయినందున గార్డియన్ తల్లి D2 అయిన తుంగ తిరుపాలమ్మ D1 To D4 నివాసం D.No:14-162-1, సైదాపురం కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ...ప్రతివాదులు D1 To D4

ప్రతివాదులకు సమన్లు

D1 తుంగ అక్కులమ్మ W/o Late రామన్న,
D2 తుంగ తిరుపాలమ్మ, W/o Late కృష్ణమూర్తి,
D3 తుంగ లిఖిత్ కుమార్, S/o Late కృష్ణమూర్తి,
D4 తుంగ జగదీష్ కుమార్, S/o Late కృష్ణమూర్తి,
D3 & D4 మైనర్లు, గార్డియన్ తల్లి తిరుపాలమ్మ D1 To D4 R/o D.No:14-162-1, సైదాపురం కదిరి టౌన్ & మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

ఇందుమూలముగా ప్రతివాదులైన మీకు తెలియజేయడము ఏమనగా పై దావాలో మీ హాజరు నిమత్తం 31/03/2023వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేది నాడు మీరు స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై తేదిన ఉదయం 10:30 గం॥లకు పై తెలిపిన కోర్టు నందు హాజరు అయి మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టువారికి తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: 31/03/2023
స్థలం: కదిరి

షేక్ మహమ్మద్ ఫైజుల్లా, ఎమ్.ఎ,ఎల్.ఎల్.బి
వాదిపరం వకీలు, కదిరి

DHARMAVARAM MUNICIPALITY

IFB Tender Notice No.203,211,212,214,217,218,219,246 to 250/GGMP/2022-23/E2. IFB Tender Notice No.111,159,176, 185,192,193,194,196,197,199,220 TO 225,228 TO 232,234,237,238, 239,243,251 & 252/General Funds/2022-23/E1.

'e' procurement Tender Notice No.203,211,212,214,217,218,219,246 to 250/GGMP/2022-23/E2 and 111,159,176,185,192,193,194,196,197,199,220 TO 225, 228 TO 232,234,237,238,239,243,251 & 252/General Funds/2022-23/E1 With value of work Rs. 1.28 Lakhs to Rs.24.50 Lakhs under General Funds 2022-2023 & GGMP 2022-23 Details of name of work, Tender document, Eligibility Criteria, Bid Submission & Price bid opening date and EMD details etc., may be seen on 'e' procurement website - https://tender.apeprocurement.gov.in.

Commissioner,
Dharmavaram Municipality.

రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

పరిగి : రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పరిగి మండల రెవెన్యూ అధికారులు వర్క్ ఫ్రమ్ రోల్‌ను పాటిస్తున్నట్లు తాసిల్దార్ సౌజన్య లక్ష్మి తెలిపారు. గురువారం కార్యాలయం వద్ద సమయపాలన పాటిస్తూ ఐదు గంటలకే కార్యాలయానికి తాళం వేసి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందన్నారు. అధికారులకు రావాల్సిన డిఏ విషయంలో కార్యాలయానికి రావలసిన బకాయిలను చెల్లించడంలో విఫలమవడం తమను బాధించిందన్నారు. ప్రభుత్వం పనితీరులో రెవిన్యూ శాఖ చాలా కీలకమని అలాంటి శాఖను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. వెంటనే రెవిన్యూ అధికారులకు రావాల్సిన బకాయిలను విడుదల చేసి తమకు న్యాయం చేయాలని చెప్పారు. శుక్రవారం నుంచి నల్ల బ్యాడ్జీలతో విధుల్లో ఉంటూ నిరసన తెలియజేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహం, విఆర్వోలు నరసింహులు, రాఘవేంద్ర, గంగాధర్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలి

హిందూపురం : అంగవైకల్యంతో ఉన్న ప్రతి ఒక్కరు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో రాణిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంజిఎం పాఠశాల ఆవరణంలో ఉన్నా భవిత కేంద్రంలో వికలాంగుల సహాయ పరికరాల పంపిణీ కోసం ఎంపిక కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, వార్డు కౌన్సిలర్ రమేష్ కుమార్, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శ్రీ ఆనంద్ బాబు, వైద్యులు డేవిడ్‌రాజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు వికలాంగులకు చేయుతనందిస్తే దేనినైన సాధించగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఆడియాలజిస్టు కృష్ణవేణి, ఫిజియో థెరపిస్టు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ రంగరాజు, సిఆర్‌పిలు లలిత, లింగరాజు, వలీబా, ప్రశాంతి, లక్ష్మి, కమల, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.